క్లుప్తంగా

గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు



ట్రాక్టర్‌ను అందజేసిన దృశ్యం

కౌతాళం: స్వచ్ఛభారత్ పథకం కింద మండలంలోని కామవరం గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు కావడంతో బుధవారం కార్యదర్శి శివప్ప ఆధ్వర్యంలో ప్రారంభించారు. పంచాయతీలో వివిధ పనులు చేపట్టేందుకు, చెత్తచెదారం తరలించేందుకు ట్రాక్టర్ అవసరం కావడంతో పంచాయతీ సభ్యుల వినతి మేరకు మంజూరు చేశారు. ఈ ట్రాక్టర్‌ను గ్రామంలో ఎప్పటికప్పుడు చెత్తచెదారం తరలించేందుకు వినియోగిస్తామన్నారు. గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కార్యదర్శి తెలిపారు.

పార్కింగ్ స్థలం కాదు తహసీల్దారు కార్యాలయం



పెద్దకడబూరు తహసీల్దార్ కార్యాలయం ముందు అడ్డంగా నిలిపిన ద్విచక్రవాహనాలు

పెద్దకడబూరు: ఈ ఫొటోలో కనిపించేది వాహన పార్కింగ్ ప్లేస్ అనుకుంటే పొరపాటే. ఇది మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం. కార్యాలయం ముందు సిబ్బందితో పాటు రైతులు, ప్రజలు తమ తమ ద్విచక్ర వాహనాలను ఇలా అడ్డంగా నిలిపారు. దీంతో కార్యాలయానికి పనిమీద వచ్చే ప్రజలకు, రైతులకు లోపలికి వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ప్రతిరోజూ ఇదే తంతు అని వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వెళ్లే వారు పేర్కొంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని వాహనాలను అడ్డంగా నిలపకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా వేలం పాట



నందవరంలో వేలం నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య

నందవరం: మండల కేంద్రంలో కమేళా, బండ్ల మెట్ట, వారాంతపు సంత మార్కెట్ నిర్వహణకు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. బుధవారం గ్రామంలోని సచివాలయం -3లో సర్పంచ్ తోట సావిత్రి ఆధ్వర్యంలో మండల అధికారుల నేతృత్వంలో వేలం పాట జరిగింది. కమేళా రూ.8,100, దినసరి మార్కెట్, బండ్ల మెట్ట రూ.1,75,500, వారాంతపు సంత మార్కెట్ రూ.50,500లకు అదే గ్రామానికి చెందిన ఎస్.భాస్కర్ హెచ్చుపాడి హక్కులను దక్కించుకున్నారు. ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ మాట్లాడుతూ.. ఈ వేలం పాట ద్వారా రూ.2,33,600 ఆదాయం సమకూరిందన్నారు. ఈ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి వినియోగిస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి రామారావు, శ్రీనివాసులు, సచివాలయ కార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా మేళా



చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న పట్టణ వాసులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా మేళా విశేషంగా ఆకట్టుకుంటోంది. స్థానిక చేనేత వస్త్రాలతో పాటు పోచంపల్లి, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, గద్వాలపట్టు, కాటన్, కలంకారీ చీరలు, బెంగాలీ చీరలు, షర్టులు, ఖాదీ, జైపూర్ బెడ్‌షీట్లు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, తదితర హస్తకళా వస్తువులు మేళాలో విక్రయానికి ఉంచారు. నేత కార్మికులను, చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆయా వృత్తుల వారు తయారుచేసిన వస్తువులను అమ్మకానికి ఉంచినట్లు గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్స్ సొసైటీ, హ్యాండీక్రాఫ్ట్ నిర్వాహకులు శేషబాబు బుధవారం తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ చేనేత హస్తకళా మేళాను ప్రజలు సందర్శించి ఆయా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

నందవరం: విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మాజీ సర్పంచ్ కాశీంవలి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం వీర నాగేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- వాంతులు, విరేచనాలతో ప్రజల అవస్థలు
- వారం రోజుల్లో 30కి పైగా అనారోగ్య కేసుల నమోదు
- అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ల సూచనలు



కొల్మాన్ పేట శాంతమ్మకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ రజిత



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గోవిందు

కోసిగి: మండలంలో వివిధ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయి. వాంతులు, విరేచనాలతో ప్రజలు అవస్థలు పడుతూ కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరుతున్నారు. మండలంలోని కొల్మాన్‌పేట గ్రామంలో వారం రోజుల్లోనే 30 మందికి పైగా ప్రజలు వాంతులు, విరేచనాలు సోకి కోసిగి హాస్పిటల్‌లో చేరి చికిత్సలు పొందారు. మంగళవారం మరో ముగ్గురు వాంతులు, విరేచనాలతో హాస్పిటల్‌లో చేరి చికిత్స చేయించుకున్నారు. అందులో 1వ వార్డుకు చెందిన ఉప్పర పాపమ్మ, రెండవ వార్డుకు చెందిన గోవిందు, కొల్మాన్‌పేట గ్రామానికి చెందిన శాంతమ్మలు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వారికి డాక్టర్ రజిత చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎక్కువగా ప్రజలు వాంతుల, విరేచనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంటుంది. ప్రతిఒక్కరూ కాచి వడబోసిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చిన్న జ్వరం వచ్చినా వెంటనే హాస్పిటల్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇటీవల కొల్మాన్‌పేట గ్రామంలో ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడడంతో గ్రామంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాం. సీజనల్ వ్యాధులు వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రజిత, కోసిగి

గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం

ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో వివిధ కాలనీల్లో చిత్తడిగా మారి పారిశుద్ధ్యం లోపించింది. డ్రయినేజీలు, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు, ఈగల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయింది. తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌లు సైతం పలు గ్రామాల్లో డ్రయినేజీ, మురుగు కాల్వలలో ఉండి పోవడంతో తాగునీరు కలుషితం అవుతోందని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపించారు. తాగునీరు కలుషితం కావడం, దోమలు, ఈగలు పెరిగిపోవడంతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరుగుతోంది. అలాగే తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం లేదని, ట్యాంకులు, కుళాయిల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.




వాంతులతో హాస్పిటల్ చికిత్స పొందుతున్న పాపమ్మ

వైభవంగా చౌడేశ్వరిదేవి రథోత్సవం



రథోత్సవంలో కలశాలతో పాల్గొన్న చిన్నారులు, మహిళలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి దేవి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని హనుమాన్ నగర్‌లో వెలిసిన రాజరాజేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ భక్తబృందం ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామున పంచామృతాభిషేకం, అలంకారం, లలిత సహస్తనామం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం రాజరాజేశ్వరిదేవి, పరమేశ్వరులకు కల్యాణోత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం పురవీధుల్లో రథోత్సవం కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా సాగింది.రాజేశ్వరి మాతకు జై నామస్మరణతో రథోత్సవం కొనసాగింది. చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొన్నారు. రాత్రి పల్లకీసేవ, ఏకాంతసేవ చేపట్టారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి

పెద్దకడబూరు: మండలంలోని పార్టీ మద్దతుదారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడొద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని 4వ సారి గెలిపించిన మండల, నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మారడంతో వంట ఏజెన్సీ లాంటి పనులు లేకుండా పోయాయని బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికీ ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్య ఎదురైనప్పుడు అర్ధరాత్రి ఫోన్ చేసినా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఏ కార్యాలయానికైనా, పోలీస్‌స్టేషన్‌కైనా వచ్చి బాధితుల తరఫున నిలబడతారన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మాట తప్పితే ప్రజల తరఫున పోరాటాలు చేస్తామన్నారు. అలాగే అభివృద్ధి పనులు చేస్తే స్వాగతిస్తామని స్పష్టం చేశారు. దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు రవిచంద్రరెడ్డి, ముక్కరన్న, పూజారి ఈరన్న, అర్లప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఎండుమిర్చి క్రయవిక్రయాలు బంద్

ఆదోని అర్బన్: స్థానిక మార్కెట్ యార్డులో ఈనెల 22వ తేదీ నుంచి ఎండు మిరపకాయల క్రయవిక్రయాలను నిలుపుదల చేసినట్లు మార్కెట్ యార్డు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండు మిరపకాయల సీజన్ ముగియడంతో క్రయవిక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. మళ్లీ సీజన్ ప్రారంభమైన తర్వాత ఎండుమిర్చి క్రయవిక్రయాలు యథావిధిగా ప్రారంభమవుతాయని తెలిపారు. రైతులు, వ్యాపారులు గమనించాలన్నారు.

పెండింగ్ కేసులను పూర్తి చేయండి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నాగరాజు

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ ఎస్పీ నాగరాజు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పోలీసు అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. బెట్టింగ్, అక్రమ మద్యం రవాణా, జూదం, పేకాట, మట్కా, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం ఒక్కొక్క అధికారితో మాట్లాడి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, విచారణ పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందిస్తున్న సంతెకూడ్లూరు గ్రామస్తులు

ఆదోని రూరల్: సంతెకూడ్లూరు ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న శ్రీనివాసులుపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బీజేపీ నాయకులు మల్లికార్జున, శరణప్ప, విష్ణువర్ధన్, గాదిలింగ తదితరులు ఎంఈఓ కార్యాలయ అధికారిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆదోనిలో ఎంఈఓ కార్యాలయ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. టీచర్ శ్రీనివాసులు చాలా రోజులుగా సెలవులో ఉన్నాడని, దీంతో విద్యార్థులకు పాఠాలు చెప్పే వారు కరువయ్యారని వాపోయారు. అలాగే పాఠశాలలో గుట్కా నమలడం, పిల్లలను ఇష్టానుసారంగా కొట్టడం, మధ్యాహ్నం సమయంలో పాఠశాలలో నిద్రపోవడం లాంటివి చేసేవాడన్నారు. దీనిపై విచారణ చేపట్టి సదరు టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. ఆయన బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాంజల చెరువులోని నీరు తాగడానికి అనువుగా లేవన్నారు. పురపాలక అధికారులు, పీఆర్ ఇంజినీర్లతో చర్చించి చెరువును పూర్తిగా ఆధునీకరించి తాగునీటి అవసరాలు తీర్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలో నిర్వహించేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అధికారులు శుద్ధి చేసిన నీటినే కుళాయిలకు సరఫరా చేయాలని ఆదేశించారు. జనసేన నాయకుడు మల్లప్ప, తెదేపా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఆదోని అర్బన్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి పెసలబండ గ్రామంలో బాధిత కుటుంబసభ్యులను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పరామర్శించారు. మృతుడి తల్లిదండ్రులు వెంకటేశులు, పద్మావతిలను ఓదార్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో రాణించాలని, క్షణికావేశంలో ప్రాణాలను తీసుకోవద్దని సూచించారు. మృతుడు ఈశ్వర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించం

నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హెచ్చరించారు. భూకబ్జాలు, మట్కా, పేకాట, నాటుసారా తయారీ తదితర వాటికి పాల్పడే వారు తీరు మార్చుకోవాలన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపేలా పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నట్లు చెప్పారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ మహిళలకు వరం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

కౌతాళం: ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ మహిళలకు వరం లాంటిదని కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు అన్నారు. ఎకల్ గ్రామోర్థన్ వారి సహకారంతో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతిమోహన్ ఆధ్వర్యంలో కౌతాళంలో నిర్వహించిన కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ వారికి సర్టిఫికెట్లను బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ.. పేద మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఎకల్ జిల్లా ప్రముఖ్ రామలింగప్ప, మహిళా ప్రముఖ్ అరుణకుమారి, వెల్‌నెస్ సెంటర్ ప్రముఖ్ వినయ్ పాండ్యా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పుట్టపర్తి, కౌతాళంలో మాత్రమే అన్నారు. ఈ శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రెండు కుట్టు మిషన్లు ఉచితంగా అందిస్తారన్నారు. త్వరలో కంప్యూటర్ శిక్షణను ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్రరెడ్డి, ఆర్‌ఎంపీ డాక్టర్ రాజానందు, బాపురం వీరయ్యశెట్టి, కృష్ణచైతన్య, బద్రి పలువురు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులిచ్చి, ఎటువంటి షరతుల్లేకుండా బ్యాంకు రుణాలివ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అదేవిధంగా కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు మంజూరు చేయాలని కోరారు. ఆ సంఘం నాయకులు చంద్రగౌడ్, నాగేంద్ర, చార్లెస్, ప్రభాకర్, ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన



ఉత్తమ ఉద్యోగులకు చెక్కును అందిస్తున్న డిపో మేనేజర్ మహ్మద్‌రఫీక్

ఆదోనిటౌన్: ఈ యేడాది ఏప్రిల్, మే నెలల్లో అధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు, అత్యధిక ఆదాయం ఆర్జించిన కండక్టర్‌లను డిపో గ్యారేజీ ఆవరణలో బుధవారం డిపో మేనేజర్ మహ్మద్‌రఫీక్ అభినందించి ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తద్వారా సంస్థను లాభాల బాటలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు రంగన్న, జి.ఎస్.సి.గోవింద్, రంగన్న, కె.ఎం.దౌలా, కండక్టర్లు జి.పోతన్న, పంపన్న, వీరేశప్ప, ఎం.వెంకటేశ్వర్లు, ఉత్తమ మెకానిక్‌లు షరీఫ్, బ్రహ్మయ్య, సుధాకర్‌లను సత్కరించారు.

రేపు పంచాయతీ వేలాలు

కోసిగి: మేజర్ పంచాయతీ కోసిగి పరిధిలోని వారపు సంత మార్కెట్, బండిమెట్ట, చిన్న కమేళా, పెద్ద కమేళాలకు సంబంధించి ఈనెల 21న పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అయ్యమ్మ, ఈఓ తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు.వారు బుధవారం మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 1 నుంచి మార్చి 31 వరకు 9 నెలల పాటు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బండిమెట్ట, వారపు సంత మార్కెట్‌కు రూ.50 వేలు డిపాజిట్, రూ.2 లక్షలు ఆస్తి సర్టిఫికెట్, చిన్న కమేళా, పెద్దకమేళాకు రూ.5 వేలు డిపాజిట్, రూ.25 వేల ఆస్తి సర్టిఫికెట్ సమర్పించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చర్మకారులకు పింఛన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం

ఎమ్మిగనూరుటౌన్: చర్మకారులకు స్వీయ ధ్రువీకరణ ఆధారంగానే పింఛన్లను మంజూరు చేసి వృత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి వృత్తి కిట్లను ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు దేవసహాయం, ఆనంద్‌బాబు, సుమాల ఆంథోని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చర్మకారులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు సుమాల రాజు, హనుమంతు, గర్జి అంజి, గుంటెప్ప, ఆదామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి



సోమలగూడూరులో ఉపాధి కూలీలు, రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీర

నందవరం: జాబ్‌కార్డు ఉన్న ప్రతి రైతు ఉద్యాన పంటలైన మునగ, కొబ్బరి, పూలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని ఏపీడీ అల్లిపీర సూచించారు. బుధవారం మండలంలోని సోమలగూడూరు, నాగలదిన్నె, పెద్దకొత్తిలి గ్రామాల్లో ఉపాధి కూలీలు, రైతులతో ఉద్యాన పంటల సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన పంటలకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం రాయితీ కల్పించిందన్నారు. రైతులకు హార్టికల్చర్ పంటల సాగుపై అవగాహన కల్పించామన్నారు. ఉద్యాన పంటల సాగుకు మండలానికి 300 ఎకరాలు టార్గెట్ నిర్ణయించగా ఇప్పటివరకు 87 ఎకరాల్లో తోటలు సాగయ్యాయని వివరించారు. మరో 37 ఎకరాల్లో సాగుకు అంచనా వేశామన్నారు. రైతులు హార్టికల్చర్ పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని, ప్రభుత్వం అందించే సబ్సిడీలను వినియోగించుకోవాలన్నారు. క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ బషీర్ అహమ్మద్, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, ఫీల్డ్ అసిస్టెంట్లు కృష్ణ, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తన విక్రయాలను అరికట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు పంపణ్ణ గౌడ్

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కల్తీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, దీన్ని అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ముందస్తు వర్షాలు కురవడంతో పంటల సాగుకు రైతులు విత్తనాల కొనుగోలు చేస్తున్నారన్నారు. కల్తీ విత్తన విక్రయ దుకాణాలపై వ్యవసాయ అధికారులు దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ఆయా దుకాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేసి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, చిన్నన్న, విరూపాక్షినాయుడు, దాదావలి, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆదోని రూరల్: ఆదోని మున్సిపాలిటీలో గత నాలుగేళ్లుగా పనిచేస్తున్న 60 మంది ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్మికులు ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు మాట్లాడుతూ.. 2021లో కరోనా మహమ్మారి వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఆ సమయంలో కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేశారన్నారు. తమ ఆరోగ్యం క్షీణిస్తున్నా పట్టణ ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని కల్పిస్తూ చెత్తచెదారం, మురుగు కాలువలను శుభ్రం చేన్నారన్నారు. వారి శ్రమకు తగిన గుర్తింపునిచ్చి కార్మికులందరికీ సమానపనికి సమాన వేతనం ఇస్తూ, ఉద్యోగ భద్రతను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు సకాలంలో వేతనాలు, సదుపాయాలు కల్పించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు సి.హుసేని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జయరాజ్, ఉపాధ్యక్షులు ఎం.మహేష్, పట్టణ అధ్యక్షులు వై.టి.భీమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేసిన దృశ్యం

నందవరం: అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను సూపర్‌వైజర్ సుధావతి పంపిణీ చేశారు. బుధవారం ముగతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లు నిండి, పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతిలో చేర్పించామన్నారు. అలాగే మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తారని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమెలమ్మ, సౌభాగ్యమ్మ, సరస్వతి, కుముదినిదేవి, శ్యామల, హరిత, పాఠశాల హెచ్‌ఎం, ఎంఎస్‌కేలు పాల్గొన్నారు.